# మినీకథ

## సంస్కారం

పుష్పమి



పూజకి పూలు కోస్తున్న నేను—మాటలు వినిపిస్తున్న వైపు చూసి ఆశ్చర్య పోయాను.

మా ఇంటావిడ, ఆవిడ ఇద్దరు కూతుళ్ళు తీరుబడిగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. "పొద్దున్నే కూర్చున్నారు.... వంట చేసేశారా" నవ్వుతూనే అడిగాను.

"మా వదిన వస్తుంది" పెద్ద అమ్మాయి చెప్పింది.

"మీ వదినగారికి అన్నీ వండేసి వుంచారన్నమాట."

"ఇప్పుడు వచ్చాక మా వదినే వండుతుంది" చిన్న అమ్మాయి జవాబు.

"ప్రయాణం చేసి వస్తారేమో ఓపిక వుంటుందా!"

"ఎందుకు వుండదూ!" చిన్న అమ్మాయి సాగదీస్తూ అంది.

రాబోయే వదినగారిపై బోలెడంత జాలి వేసింది.

బహుశా మోటుమనిషి అయ్యుండాలని కూడా అనుకున్నాను. పనిచేసుకుంటు న్నానుగాని నా మనసంతా వదినగారి రాక కోసమే ఎదురుతెన్నులు చూస్తోంది.

సాయంకాలం నాలుగు గంటలకి వదిన గారి దర్శనం అయింది. తెల్లగా నాజూకుగా ఉండి మరీ మరీ చూడాలనిపించేటట్టుగా ఉంది. తిన్నగా లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి భర్తకి పిల్లలకి ఇచ్చింది. మా ఇల్లుగలావిడ కాని, కూతుళ్ళు కాని కదలకపోవడం చాలా ఆశ్చర్యమనిపించింది. కాఫీ కూడా ఆవిడే కలిపి తెచ్చింది. ఆ తరువాత ఆవిడ కనుపించలేదు. అత్తా, ఆడపడుచులు కూర్చునే వున్నారు.

వదినగారితో మాట్లాడితే ఎలాఉంటుందో ఏమంటుందో వినాలని అనిపించి సమయం కోసం ఎదురుచూస్తే మర్నాడు ఒంటరిగా కనిపించిన ఆవిడను చూసి, పలకరింపుగా నవ్వాను. ఆవిడ చిన్నగా నవ్వింది.

"పూలు కోసుకోండి" మాటలు కలుపుతూ అన్నాను.

"మొక్కలకే వుంటే అందంగా వుంటాయి."

"మీరు ఏ పూలూ పెట్టుకోరా!" ఆశ్చర్యంగా అన్నాను. "పూలంటే ఇష్టమయినా.. ఎందుకో కొయ్యాలనిపించదు."

"కొన్నాళ్ళు వుంటారా!" మాటమారుస్తూ అడిగాను.

"రేపు వెళ్ళిపోతాను."

"అప్పుడే.." ఆశ్చర్యంతో అన్నాను.

"మా వాళ్ళని చూడద్దూ." నవ్వుతూ అంది.

"మీ వదినలచేత వండించుకుంటూ, విశ్రాంతి తీసుకోవచ్చును." చిన్నగా అన్నాను.

"మేము అంతా కలిసే పనిచేసుకుంటూ, కబుర్లు చెప్పుకుంటాము. అదే మాకు మంచి విశ్రాంతి. ఆనందమూను" మృదువుగా అంది.

ఆవిడ జవాబుకి నా కళ్ళు తెరుచుకున్నాయి.

వదినలు పనివాళ్ళు కారు. స్నేహితులు. తోడబుట్టిన సోదరీలు అనుకుంటే ఎంతో ఆనందంగా ఉంది.